తహసీల్దార్ కుర్చీ ఖాళీ!



- డీటీకి డిజిటల్ కీ ఇవ్వని ఉన్నతాధికారులు
- పనులు జరగక ప్రజలు ఇబ్బందులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి రెవెన్యూ కార్యాలయంలో పదిరోజులుగా తహసీల్దార్ కుర్చీ ఖాళీగా ఉంటోంది. జిల్లాలోని అత్యంత సమస్యాత్మక నియోజకవర్గాల్లో తాడిపత్రి ప్రథమ స్థానంలో ఉంటోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అంజనేయులు ఇతర ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. అప్పట్లో కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న రజాక్‌వలికి తహసీల్దార్‌గా తాడిపత్రికి పోస్టింగ్ ఇచ్చారు. మొదట్లో ఆయన బాధ్యతలు చేపట్టేందుకు పలు అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని రజాక్‌వలి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొంత కాలం హైడ్రామా అనంతరం ఎట్టకేలకు రజాక్‌వలి తాడిపత్రి తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మెతకవైఖరిని అవకాశంగా చేసుకున్న మరో ఉద్యోగి కూటమి నేతలతో టచ్‌లో ఉంటూ తహసీల్దార్ కార్యాలయ నిర్వహణ బాధ్యతను తానే చేతుల్లోకి తీసుకున్నారన్న ప్రచారం ఉంది. తన అధికార దర్పంతో కింది స్థాయి ఉద్యోగులను నయానో, భయానో చేతుల్లో పెట్టుకున్నాడని తెలుస్తోంది. దీంతో రజాక్‌వలి అసంతృప్తిగా ఉండేవారు. మరోవైపు తహసీల్దార్ రజాక్‌వలిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటి కొలతల విషయంలో కమిటీ కన్వీనర్‌గా నియమించారు. వివాదస్పదమైన కొలతల వివాదం ఎక్కడ తన మెడకు చుట్టుకుంటుందన్న ఆలోచనతో కలెక్టర్ కార్యాలంలో ఉన్న సంబంధాల కారణంగా గుమ్మఘట్టకు బదిలీ చేయించుకున్నారు.

అడ్డుకుంటున్న రాజకీయ నాయకులు..

బదిలీపై తాడిపత్రికి రావాల్సిన పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణి ఉద్యోగ నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటుందన్న ఆలోచనలో ఇక్కడి రాకుండా స్థానిక రాజకీయ నాయకులు మోకాలడ్డుతున్నారన్న ప్రచారం ఉంది. కలెక్టర్ కార్యాలయంలో కో–అర్డినేటర్ సూపరింటెండెంట్‌గా ఉన్న యుగేశ్వరీని పెద్దవడుగూరు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. తాడిపత్రికి బదిలీపై ఉషారాణి రాకుండా అడ్డంకులు ఎదురవడంతో పెద్దవడుగూరులోనే ఉషారాణిని ఉంచి బదిలీ చేసిన యుగేశ్వరిని పూర్వపు స్థానానికి తిరిగి రప్పించారు. ప్రస్తుతం తాడిపత్రి తహసీల్దార్‌గా ఉషారాణి స్థానంలో మరోకరి పోస్టింగ్ ఇస్తారా లేక కొంత కాలం పాటు వెచి చూసే ధోరణిలో అధికారులు ఉంటారా అన్నసందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఉన్నతాధికారులు వేచిచూసే ధోరణిని అవలంభించి సక్సెస్ అయ్యారు. మరోసారి ఈ ప్రయోగం చేసేందుకే మరొకరికి పోస్టింగ్ ఇవ్వలేదని తెలుస్తోంది.



తహసీల్దార్ కార్యాలయం



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

ఇబ్బందుల్లో ప్రజలు

తహసీల్దార్ రజాక్‌వలి బదిలీపై వెళ్లి పది రోజులు కావస్తోంది. ఇన్‌చార్జ్‌గా డిప్యూటీ తహసీల్దార్‌గా సోమశేఖర్‌ను నియమించారే తప్ప పుల్ ఛార్జ్ ఇవ్వలేదు. దీంతో డిజిటర్ కీ లేకపోవడంతో తహసీల్దార్ సంతకం లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు రకాల సంతకాల కోసం పనులు వదిలి పెట్టుకుని పేద ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి రావడం.. తహసీల్దార్ సంతకానికి డిజిటల్ కీ లేదని అధికారులు వెనక్కి పంపడం జరుగుతోంది. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న డిప్యూటీ తహసీల్దార్‌కు ఫుల్ ఛార్జ్ ఇచ్చి డిజిటల్ కీ ఇస్తారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పత్రాలపై డిజిటర్ కీ సంతకాలు కావాల్సిన వారి పరిస్థితి దయనీయంగా ఉంటోంది.

ఫాదర్ ఫెర్రర్ సేవలు మరువలేనివి

బుక్కరాయసముద్రం/యాడికి/గుంతకల్లు టౌన్: జిల్లాలో ఆర్డీటీ ఫాదర్ ఫెర్రర్ పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి అన్నారు. ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా గురువారం బీకేఎస్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ కరువు జిల్లాలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆర్డీటీ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఫాదర్ ఫెర్రర్ ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం చెన్నంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఫాదర్ ఫెర్రర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుళ్లాయప్ప, నాగమ్మ, శివ శంకర్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

- యాడికి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో వర్ధంతి సందర్భంగా ఫాదర్ విగ్రహానికి గురువారం లయన్స్ క్లబ్ సభ్యులు, ఉన్నత పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎఫ్‌సీఆర్ పునరుద్ధరించాలని ఆర్డీటీ సిబ్బంది తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.



చెన్నంపల్లిలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కార్యక్రంలో హెచ్ఎం సీతా రామాంజనేయులు, లయన్స్ క్లబ్ సభ్యులు రజాక్, కులశేఖర్ నాయుడు, జాఫర్, సునీల్ కుమార్, సురేష్, గుండా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

- గుంతకల్లులోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఫెర్రర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాల్లో విద్య, వైద్యంతో పాటు పేదరిక నిర్మూలనకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్డీటీకి విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం తగదన్నారు. కేంద్రం వెంటనే ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రామునాయక్, సూరి, వంశీ, రాఖీ పాల్గొన్నారు.

అధ్వానంగా హెచ్చెల్సీ ఆయకట్టు



తాడిపత్రిలో మాట్లాడుతున్న సర్పంచ్ యుగంధర్



పుట్లూరులో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీవాణి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి హెచ్ఎల్‌సీ ఆయకట్టు అధ్వానంగా మారింది. వచ్చేది విత్తన కాలం.. ఆయకట్టుకు నీరు వస్తుందో లేదో తెలుసుకోవాలనుకుంటే మేజర్ ఇరిగేషన్ అధికారులు కనిపించడం లేదని యర్రగుంటపల్లి సర్పంచ్ యుగంధర్ ప్రశ్నించారు. తాడిపత్రి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన ఎంపీడీఓ ఫాజిల్‌బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యుగందర్ మాట్లాడుతూ తాడిపత్రి హెచ్ఎల్‌సీ కింద దాదాపు 32 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. కాలువ అంతా ముళ్లపొదలతో నిండి ఉందని, డిస్ట్రిబ్యూటర్ కాలవల షట్టర్లు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా మారాయన్నారు. ఏడాది కాలంలో ఒక్కటెండు సార్లు మాత్రమే నీరు వస్తే రైతులు పంటలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. సమస్యను మేజర్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకొస్తామనుకుంటే వారు కనిపించడం లేదన్నారు. ఇరిగేషన్ అధికారులు సమావేశాలకు కూడా రాకపోతే ఎవ్వరిని ప్రశ్నించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు ఆయా శాఖల పురోగతిని వివరించారు. కార్యక్రమంలో ఏఓ రాజేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రాజరవిశేఖర్, అగ్రికల్చర్ అధికారి ఆంజనేయులు, ఉద్యానవనశాఖ అధికారి ఉమాదేవి, ఏఈ సురేష్‌రెడ్డి, ఎంఈఓ నాగరాజు, ఏపీఓ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా ముగిసింది. ఎంపీపీ బి.రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులు ఆయా శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆదినారాయణ గత కొన్ని రోజులుగా సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలి

గార్లదిన్నె: ప్రభుత్వం వెంటనే హంద్రీ-నీవా కాలువ వెడల్పు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలన్నారు.ఉపాధి పథకంలో 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. కార్యక్ర మంలో అఖిల భారత రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శి క్రిష్ణ, మండల కార్యదర్శి రాజశేఖర్, కమిటీ సభ్యులు వెంకటేష్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



గుంతకల్లులో మాట్లాడుతున్న స్వామిదాస్



గుత్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వీరేష్ డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కార్మిక జేఏసీ చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి రెండో రోజుకు చేరుకున్నాయి. కార్మికుల దీక్షకు ఎమ్మార్పీఎస్, దళిత, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ పట్టణ కార్యదర్శి జన్నే మస్తానయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేంద్ర, నాయకులు ఫిరోజ్, ఆలంనవాజ్, సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ గుత్తిలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు రాజా, సూర్యనారాయణ, రామాంజి, ఆది , మహేష్ ల ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, 36వ జీవో ప్రకారం జీతాలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కారం చేయకపోతే ఈ నెల 23న జిల్లా కేంద్రంలో ఆందోళన చేపడతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని ఎగువపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శింగనమల మండలం కల్లుమడికి చెందిన రాజశేఖర్, శేషు అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో అనంతపురం నుంచి కల్లుమడికి వెళ్తుండగా.. ఎగువపల్లి హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డీవైడర్ ఢీకొంది. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెరువుతండా గ్రామ సమీపంలో గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఎర్రిస్వామి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా చెరువుతండా గ్రామంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎర్రిస్వామిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

శింగనమల: నియోజకవర్గంలోని ఓటరు జాబితాల్లో ఏవైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తామని తహసీల్దార్ శేషారెడ్డి సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 లపై వివరించారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియనన్నారు. కార్యక్రమంలో డీటీ సూర్యప్రతాప్, ఎన్నికల డిటి హబీబా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌వీ నారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకురహిత సమాజమే లక్ష్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెద్దవడుగూరు: పొగాకు రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి డాక్టర్ నారాయణ స్వామి, పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అమర్‌నాథ్, శ్రీనివాసబాబు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆస్పత్రి లో ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ పొగాకు ఏ రూపంలో తీసుకున్నా ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవడమే అన్నారు. విద్యాలయాల పరిసరాలల్లో పొగాకు సిగరెట్, చైనీ, గుట్కా లాంటి ఉత్పత్తులను విక్రయించకుండా నియంత్రించాలన్నారు. పొగాకు ఉత్పత్తులను నియంత్రించడానికి తోడ్పడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ సోషియల్ వర్కర్ శ్రీరాములు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ ఆంజినేయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతి



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శేషారెడ్డి, సిబ్బంది

శింగనమల: మండలంలోని సోదనపల్లి వీఆర్ఏ వెట్టి నారాయణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శేషారెడ్డి, సిబ్బంది వీఆర్ఏ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షులు ఓబిలేసు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నివారణ



ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

యాడికి: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వ్యాధి నివారణ సాధ్యమని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని తిరునాంపల్లిలో యాడికి ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర, 104 సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దోమల నివారణ కోసం డ్రైడే ఫ్రైడే పాటించడంతోపాటు రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. అనంతరం యాడికిలోని ప్రథమ చికిత్స కేంద్రాన్ని వైద్యాధికారి పరమేశ్వర తనిఖీ చేశారు. అలాగే మండల కేంద్రంలోని ఆర్ఎంపీ శివశంకర్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శించి, రోగులకు ఇంజెక్షన్లు వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్, సిబ్బంది మద్దిలేటి, సబిహ, ఆశా కార్యకర్త సరస్వతి, 104 డీఈఓ అనిల్ తెలిపారు.

‘అన్నదాత సుఖీభవ’ నిధులు ఒకేసారి ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

గుత్తి: అన్నదాత సుఖీభవ పథకం నిధులను రైతులకు ఒకే సారి ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ వరదరాజులు డిమాండ్ చేశారు. గుత్తిలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీ భవ నిధులను ఒకేసారి ఇవ్వకుండా పలు దఫాలుగా ఇవ్వడానికి సిద్ధమైందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఒకే దఫా ఇవ్వాలన్నారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాట ధర కల్పించాలన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ సభ్యులు జ్ఞానేశ్వర రెడ్డి, అరుణ్‌కుమార్, సుభాష్ చంద్ర బోస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

తాడిపత్రి రూరల్: డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్ సూచించారు. తాహసీల్దార్ కార్యాలయంలో గురువారం తాడిపత్రి పట్టణ, రూరల్ మండలానికి చెందిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందకుండా జాగ్రత్త వహించాలన్నారు. సీఎస్‌డీటీ మల్లేష్ మాట్లాడుతూ రేషన్ గోడౌన్ నుంచి వచ్చే బస్తాల్లోని బియ్యాన్ని సక్రమంగా తుకాలు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. గోడౌన్ ఇన్‌చార్జ్ శ్రీరాములు మాట్లాడుతూ గోడౌన్‌లో బస్తాలను తుకాలు వేసుకోవాలని డీలర్లకు సూచించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న 15 మంది ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సుబహాన్ ఆధ్వర్యంలో బదిలీ అయిన నాగరాజు, ప్రతాప్, భరత్ భూషణ్, రఘురాం, శేషాద్రిలతో పాటు మరో పది మందిని శాలువాలు, పూల మాలలతో ఉపాధ్యాయులు సత్కరించారు.

తహసీల్దార్‌గా పుణ్యవతి



గుత్తి రూరల్: గుత్తి తహసీల్దార్‌గా జి.పుణ్యవతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుత్తి తహసీల్దార్‌గా ఉన్న ఓబిలేసును సాధారణ బదిలీలలో భాగంగా విడపనకల్లు తహసీల్దార్‌గా బదిలీ చేయడంతో బుక్కరాయసముద్రం తహసీల్దార్ పుణ్యవతిని గుత్తికి బదిలీ చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ పుణ్యవతి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటు ఉంటానన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ఆనంద్ బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌కు డిప్యూటీ తహసీల్దార్ ఎంకే.సూర్యనారాయణ, ఆర్ఐ హనుమప్రసాద్, వీఆర్ఓ, వీఆర్ఏలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డీటీగా సూర్యప్రతాప్



డీటీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్ఏలు

శింగనమల: శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా సూర్యప్రతాప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ ప్రకాష్‌రావు నార్పల మండలానికి బదిలీ కావడంతో , ఆ స్థానంలో కూడేరు మండలంలో డీటీగా ఉన్న సూర్యప్రతాప్ బదిలీపై వచ్చారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, రామాంజినేయులు, ధనుంజయ, శ్రీనివాసులు, ముని ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

చీనీ చెట్ల ధ్వంసం



డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్లూరు: మండలంలోని గోపురాజుపల్లిలో రైతు నారాయణరెడ్డి పొలం 30 చీనీ చెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఉదయాన్నే తోటకు వెళ్లిన రైతు చీనీ చెట్లను ఇష్టానుసారంగా విరిచివేసి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సత్యబాబు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేపట్టారు. రెండు సంవత్సరాల వయస్సు ఉన్న చీనీ చెట్లను కాలితో తొక్కి విరిచినట్లు గుర్తించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాడిపత్రిలో చైన్‌స్నాచింగ్

తాడిపత్రి టౌన్: స్థానిక టైలర్స్ కాలనీలో చైన్‌స్నాచింగ్ జరిగింది. కాలనీలో నివాసముంటున్న వివాహిత ఆదిలక్ష్మి జీవనోపాధి కోసం కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంది. గురువారం ఉదయం 6 గంటలకు దుకాణంలో ఆమె ఉన్న సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై అక్కడకు చేరుకున్నారు. హెల్మెట్ ధరించిన వారు కిరాణా దుకాణంలో సరుకులు కొనుగోలు చేసేవారిలా నటిస్తూ ఆదిలక్ష్మి దృష్టిని ఏమార్చి ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు. బాధితురాలి నుంచి సమాచారం అందుకున్న సీఐ శివగంగాధరరెడ్డి అక్కడకు చేరుకుని ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రెండో విడత ఐటీఐ అడ్మిషన్లు ప్రారంభం

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ వరుణ్‌కుమార్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 15లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐటీఐ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గుత్తిలో యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా



గార్లదిన్నెలో యోగా చేస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు, ప్రజలు



పామిడి పంచాయతీ కార్యాలయంలో యోగాసనాలు అభ్యసిస్తున్న అధికారులు



తాడిపత్రిలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/గుత్తి/గార్లదిన్నె/పామిడి/యాడికి/గుంతకల్లు రూరల్/పెద్దవడుగూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అధికారులు సూచించిరు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో శనివారం యోగా సాధనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఈ నెల 21న అన్ని గ్రామ సచివాలయాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు, ప్రజలు ఆసనాలు వేశారు. తాడిపత్రిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపార్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు జయలక్ష్మి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని రెహనా స్కూల్లో యోగా ట్రెయినర్స్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా యోగా చేశారు. గార్లదిన్నెలో ఆర్డీఓ కేశవనాయుడు, అధికారులు యోగాంధ్ర కార్యక్రమంపై రీహార్సల్ చేశారు. అదేవిధంగా పామిడిలో ఎంపీడీఓ కే తేజ్యోత్స్న, ప్రభుత్వ ఆయుష్ వైద్యురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో యోగా ఫ్యాకల్టీ సంధ్యాదత్ ప్రజలతో యోగాసనాలను అభ్యసింపజేశారు. ఈఓ అశ్వర్థ నాయుడు, పంచాయితీ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని గుత్తిఅనంతపురం, విరుపాపురం, ముప్పాలగుత్తి గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ బారస్‌సాహెబ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జయప్రదం చేయాలని పామిడి, యాడికి ఎంపీడీఓలు తేజోత్స్న, వీర్రాజు, గుంతకల్లు తహసీల్దార్ రమాదేవి సూచించారు.